సాక్షి
పల్నాడు
బుధవారం । 30 । అక్టోబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 50915 క్యూసెక్కులు వచ్చిచేరుతుంది. దిగువకు 44274 క్యూసెక్కులు వదిలారు.



విద్యార్థులకు పతకాలు

కర్లపాలెం: చింతాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వారిని పాఠశాల హెచ్ఎం టి.వెంకటరాజు, పీడీ ఎం.గోపి అభినందించారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన ప్రతిపాటి ఆరుష్ వెంకట్ కుటుంబం రూ.1,00,116 విరాళం అందజేసింది.

న్యూస్‌రీల్

సబ్‌జైల్ తనిఖీ



గురజాల : గుంటూరు లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, న్యాయమూర్తి టి.లీలావతి మంగళవారం గురజాల సబ్ జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్తోమత లేని వారికి న్యాయ సలహాలు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. సకాలంలో భోజన వసతి, వైద్య సదుపాయాలు అందుతున్నాయా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కలివెల ప్రభుదాసు, జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ సుబ్బారెడ్డి, అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ఆర్టీసీ డీఎం రాంబాబు

చిలకలూరిపేట: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఏపీఎస్ ఆర్టీసీ పంచారామ క్షేత్రాలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఎస్.రాంబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నవంబర్ ఒకటో తేదీ నుంచి చిలకలూరిపేట డిపో నుంచి ప్రతి శని, ఆదివారాల్లో రాత్రి 10 గంటలకు ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని వెల్లడించారు. ఇక్కడి నుంచి బయలుదేరిన బస్సులు పంచారామాలను దర్శించుకొని మరుసటి రోజు రాత్రికి చిలకలూరిపేటకు చేరుకుంటాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి ఎక్స్‌ప్రెస్‌కు రూ.1,000, సూపర్ లగ్జరీకి రూ.1,300 టికెట్ ధరగా నిర్ణయించినట్లు చెప్పారు. బృందాలుగా వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9959225427, 6303325113, 7382893037లను సంప్రదించాలని సూచించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటర్ల జాబితా ప్రతులు



నరసరావుపేట: సంక్షిప్త ఓటరు నమోదు కార్యక్రమం-2025 (స్పెషల్ సమ్మరీ రివిజన్-2025)లో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం ఓటర్ల జాబితా ప్రతులను రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేశారు. నవంబర్ 28 వరకు కొత్త క్లెయిమ్‌లు, ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నాయకులకు సూచించారు. ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పంటల బీమా దరఖాస్తుకు డిసెంబర్ 31 వరకు అవకాశం



నకరికల్లు: పంటల బీమాకు దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబర్ 31 వరకు అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మురళి మాట్లాడుతూ వ్యవసాయశాఖ సూచించిన ఎరువులను మాత్రమే పంటలకు వినియోగించాలని సూచించారు. వరి పంటకు ఎకరాకు రూ.630 ప్రీమియం చెల్లించి పంటల బీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఈ-పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్ కుమార్, వెటర్నరీ జేవీఓ కె.సీతారత్నం, వీఆర్వో లింగయ్య, రైతులు పాల్గొన్నారు.

పోరంబోకు కబ్జా

తెలుగు తమ్ముళ్ల అరాచకం

- దాచేపల్లిలో సుమారు రూ.6 కోట్ల విలువైన వాగు పోరంబోకు భూమి కబ్జా
- అక్రమంగా మట్టి తోలి చదును చేస్తున్న టీడీపీ నేత
- యరపతినేని శ్రీనివాస్ అనుచరుడి నిర్వాకం
- రెవెన్యూ అధికారులకు బెదిరింపులు
- సెలవుపై దాచేపల్లి తహసీల్దార్!
- కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు



దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో టీడీపీ నేత ఆక్రమించిన వాగు పోరంబోకు భూమి



ఇది ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



భూమిలో టిప్పర్ల ద్వారా మట్టిని తొలిస్తున్న దృశ్యం

సాక్షి, నరసరావుపేట : ప్రభుత్వ పోరంబోకు భూములపై టీడీపీ నేతల కన్ను పడింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైతే విలువైన ప్రభుత్వ పోరంబోకు, వాగు పోరంబోకు భూములు ఉంటాయో వాటిపై గద్దల్లా వాలిపోతున్నారు. ప్రధానంగా హైవే పక్కనే ఉన్న వాగు పోరంబోకు భూములను కాజేసేందుకు పన్నాగం పన్నుతున్నారు. పల్నాడు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రభుత్వ భూములను కూటమి నేతలు ఆక్రమించుకున్నారు. తాజాగా గురజాల నియోజకవర్గం దాచేపల్లి పరిధిలోని అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే పక్కనే ఉన్న రూ.6 కోట్ల విలువ చేసే 40 సెంట్ల వాగుపోరంబోకు భూమిపై టీడీపీ నేత కన్నేశాడు. ఆ భూమిని ఆక్రమించి అక్రమంగా మట్టి తోలించి చదును చేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు అడ్డుకునేందుకు యత్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

నకిలీ పత్రాలు సృష్టించి మరీ..!

దాచేపల్లి నగర పంచాయతీ పరిధి నడికుడిలో సర్వే నంబర్ 127/1లో 40 సెంట్ల వాగు పోరంబోకు భూమి ఉన్నది. ఆర్ఎస్ఆర్ దాఖలులోనూ వాగు పోరంబోకు అని స్పష్టంగా ఉంది. ఈ భూమిని పిడుగురాళ్ల మండలం వీరాపురానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి ప్రోద్బలంతో ఇద్దరు వ్యక్తులు గతంలో టీడీపీ అధికారంలో ఉండగా పక్కా సర్వే నంబర్‌తో ఉప సంఖ్య జోడించి 2015లో ఆన్‌లైన్‌లో అక్రమంగా నమోదు చేయించుకుని పాసు పుస్తకాలు పొందారు. అప్పట్లో రెవెన్యూ అధికారులకు తాయిలాలు ముట్టజెప్పినట్టు విమర్శలు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ భూమిని పలుమార్లు అమ్మాలని యత్నించినా వాగు పోరంబోకు భూమి కావటంతో ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భూమిని పూర్తిగా హస్తగతం చేసుకునేందుకు టీడీపీ నాయకుడు పావులు కదిపాడు. టిప్పర్లతో మట్టి తోలించి చదును చేస్తున్నాడు. తాను ఈ భూమిని కొన్నానని, అందుకు అవసరమైన పత్రాలు ఉన్నాయంటూ బుకాయిస్తున్నాడు.

కఠిన చర్యలు తీసుకుంటాం



దాచేపల్లి పరిధిలోని 127/1 సర్వే నంబర్‌లో ఉన్నది ముమ్మాటికీ ప్రభుత్వ భూమే. అది అక్రమణలకు గురవుతోందని ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ప్రస్తుతం ఆ భూమి వాగు పోరంబోకుగా నమోదై ఉంది. కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు ఆ భూమి తమదేనంటూ వస్తున్నారు. భూమికి సంబంధించిన పత్రాలను 1978 నుంచి పరిశీలిస్తున్నాం. అంత వరకు వేరే వారు ఎవరూ ఆ భూమిలోకి ప్రవేశించకుండా అడ్డుకోవాలని దాచేపల్లి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేశాం. ఆ భూమిని స్వాధీనం చేసుకోవడం లేదా అందులో నిర్మాణాలు చేపట్టడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– వి.మురళీకృష్ణ, గురజాల ఆర్డీఓ.

ఇది ప్రభుత్వ భూమి అని ఫ్లెక్సీ

అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే పక్కనే ఉన్న ఈ భూమి చాలా విలువైంది. దీనిని రక్షించేందుకు రెవెన్యూ అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ భూమి ప్రభుత్వ భూమి అని, దీనిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోర్డు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఈ భూమిని ఎవరు ఆక్రమించినా చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గతంలో దాచేపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ 2022 డిసెంబర్ 13న దాచేపల్లి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు కూడా. ఈ కాపీని కలెక్టర్, డీఆర్వో, గురజాల డీఎస్పీలకు అధికారులు పంపించారు.

రెవెన్యూ అధికారులకు బెదిరింపులు

ఇటీవల డయేరియా బాధితులను పరామర్శించేందుకు దాపల్లికి వచ్చిన కలెక్టర్ పి.అరుణ్‌బాబును పలువురు స్థానికులు కలిసి భూమిని ఆక్రమించుకుని మట్టి తోలుతున్న టీడీపీ నేతపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ గురజాల ఆర్డీఓకు ఈ వినతిపత్రం ఇచ్చి విచారణ జరిపి నివేదిక పంపించాలని ఆదేశించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో రెవెన్యూ అధికారులు పెట్టిన ఫ్లెక్సీ, బోర్డులను టీడీపీ నాయకుడు రాత్రికి రాత్రే తొలగించాడు. తనకు అడ్డుపడితే అంతు చూస్తానని రెవెన్యూ అధికారులపై బహిరంగంగానే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఇతను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అనుచరుడు కావడంతో తీవ్ర భయాందోళనకు గురైన దాచేపల్లి తహసీల్దార్ వైవీ కుటుంబరావు సెలవుపై వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడ్డుకట్ట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని తెలుసుకున్న అప్పటి గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అడ్డుకున్నారు. అక్రమించినవారు ఎంతటి వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సూచించారు. దీంతో ఈ భూమి జోలికి ఎవరూ వెళ్లకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకూ ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత ఉందని స్థానికులు గుర్తు చేస్తున్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

డీఈఓ చంద్రకళ



నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య బలోపేతానికి మండల విద్యాశాఖాధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. మండల కార్యాలయంలో మంగళవారం జిల్లా పరిధిలోని మండల విద్యాశాఖాధికారులు-1, 2తో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, సలహాలను స్వీకరించాలన్నారు. అలాగే పీఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికైన వాటికి అవసరమైన సదుపాయాలను కల్పించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారులు కె.వేణుగోపాలరావు, యేసుబాబు, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ కె.ఎం.ఏ.హుస్సేన్, డిసిఈబి కార్యదర్శి కృష్ణనాయక్ పాల్గొన్నారు.

నైపుణ్య గణనను జయప్రదం చేయాలి

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు

నరసరావుపేట ఈస్ట్: నైపుణ్య గణనను జయప్రదం చేయాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో మంగళవారం నైపుణ్య గణన సిబ్బంది శిక్షణ శిబిరం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన ఇద్దరు సచివాలయ సిబ్బంది చొప్పున శిక్షణకు హాజరయ్యారు. తమ్మాజీరావు మాట్లాడుతూ ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గంలో నైపుణ్య గణన పూర్తి చేసినట్టు తెలిపారు. నైపుణ్య గణన యాప్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి వెంకటరెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

చిచ్చురేపిన ప్రేమ లేఖ

- ఎంఈఓ-1, 2ల మధ్య విభేదాలకు ఆజ్యం
- వర్గపోరుతో రచ్చకెక్కిన విద్యాశాఖ
- గతంలోనూ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు



మండల విద్యాశాఖ కార్యాలయం

కారెంపూడి: ఓ విద్యార్థిని వద్ద లభ్యమైన ప్రేమ లేఖ ఇద్దరు మండల విద్యాశాఖాధికారుల మధ్య చిచ్చురేపింది. దీంతో ఎంఈఓ-1, 2లు ఇద్దరూ రచ్చకెక్కారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ విద్యాశాఖ ప్రతిష్టను మసకబారుస్తున్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఒక విద్యార్థిని వద్ద ప్రేమ లేఖ దొరకడంతో పాఠశాల ఎస్‌ఓ విద్యార్థినిని మందలించారు. బాలిక తరుపున ఒక పాస్టర్ వెళ్లి ఎస్‌ఓతో గొడవ పడ్డారు. దీంతో ఎంఈఓ-2 పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈ ఘటన ఎంఈఓ-1కు ఆగ్రహం తెప్పించింది. 'నేను చేయాల్సిన పని మీరెలా చేస్తారంటూ ఎంఈఓ-2పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోరు పారేసుకున్నారు. దీనికి ఎంఈఓ-2 తహసీల్దార్ చెబితే వెళ్లానని సమాధానమిస్తూ ఎంఈఓ-1 మాటలను కూల్‌గా రికార్డు చేసుకున్నారు. ఆ వాయిస్ రికార్డు వెలుగు చూడడంతో ఎంఈఓ-1 మళ్లీ ఆగ్రహించారు. దీనికి కౌంటర్‌గా అన్నట్లు ఎంఈఓ-2 టీచర్లను బెదిరిస్తున్న ఆడియో ఒకటి వెలుగు చూసింది. ఒక స్కూల్లో ముగ్గురు టీచర్లుంటే ఒక టీచర్‌కు మద్దతుగా మిగతా ఇద్దర్ని బెదిరిస్తూ ఎంఈఓ-2 మాట్లాడిన ఫోన్ సంభాషణ అది. ఆ టీచర్ ''మీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానంటోందని ఎంఈఓ-2 చెబుతూ భయపెట్టినట్టు ఆడియోలో ఉంది.

గతంలోనూ విభేదాలే

ఎంఈఓలిద్దరి మధ్య గతంలోనూ విభేదాలు ఉన్నట్టు సమాచారం. ఒకరిపై ఒకరు అధికారులకు తరచూ ఫిర్యాదులు చేసుకుంటున్నారని తెలుస్తోంది. వారిద్దరూ విధుల్లో చేరిన దగ్గర నుంచి సఖ్యత లేదని సమాచారం. ఆదర్శంగా ఉంటూ పాఠశాలలను సవ్యంగా నడిపించాల్సిన వారే తగువులాడుకుంటుండడంతో సహజంగానే ఆ దుష్ప్రభావం పాఠశాలలపై పడుతోంది. అంతర్లీనంగా ఉపాధ్యాయుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి ఘటనలు తావిస్తున్నాయి. వాస్తవానికి ఎంఈఓ-1 మండల విద్యాశాఖ కార్యాలయానికి సంబంధించిన పూర్తి విధులు, బాధ్యతలు నిర్వర్తించాలి. ఎంఈఓ-2 పాఠశాలలను తనిఖీ చేస్తూ అకడమిక్ పురోగతికి పాటుపడాలి.

అందుబాటులో ఉండని ఎంఈఓ-1

కారెంపూడి ఎంఈఓ-1 వెల్దుర్తి, గురజాల, మాచర్ల, దాచేపల్లి మండలాలకూ ఎంఈఓ-1గా ఎఫ్ఏసీగా పని చేస్తున్నారు. దీంతో ఆయన అన్నిచోట్లా అందుబాటులో ఉండడం సాధ్యం కాకపోవడంతో ఆయన విధుల్లో ఎంఈఓ-2 వేలు పెడుతున్నారని స్పష్టమవుతోంది. అత్యవసర సమయాల్లో ఇతర విద్యాశాఖ కార్యక్రమాలలో అందుబాటులో ఉన్న ఎంఈఓ-2నే పాల్గొంటున్నారు. సమస్య వచ్చినప్పుడు పని ఒత్తిడి వల్ల ఎంఈఓ-1 అందుబాటులో ఉండలేకపోతున్నారని తెలుస్తోంది. ఈ సమస్యను ఉన్నతాధికారులు పరిష్కరించకపోతే మండలంలో విద్యాభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

యార్డుకు 43,346 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 43,346 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 41,651 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. యార్డులో ఇంకా 30,279 బస్తాల మిర్చి నిల్వ ఉంది.



బాపట్లలో భగ్గు

ఎంపీ, ఎమ్మెల్యే మధ్య ఆధిపత్యపోరు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అధికార తెలుగుదేశం పార్టీలో ఇంటిపోరు రోడ్డున పడింది. బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఫలితంగా పార్టీ రెండు వర్గాలుగా చీలింది. ఇప్పటికే ఇద్దరు నేతల అనుచరులు అధిష్టానానికి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నట్లు సమాచారం. వీరి పంచాయితీ తేల్చాలని ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారథి, జిల్లా మంత్రులు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్‌లకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆది నుంచీ విభేదాలు

ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మల మధ్య ఆది నుంచి విభేదాలు ఉన్నాయి. కృష్ణప్రసాద్‌ను తెలంగాణ బీజేపీ నుంచి దిగుమతి చేసుకుని ఎంపీ అభ్యర్థిగా నిలపడాన్ని జిల్లాలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులతోపాటు వేగేశన నరేంద్రవర్మ వ్యతిరేకించారు. ఎన్నికల సమయంలో కృష్ణప్రసాద్ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రచారం చేసేందుకూ వర్మ అంగీకరించలేదు. కృష్ణప్రసాద్ ఎంపీ అయ్యాక విబేధాలు మరింత పెరిగాయి. కొందరు అధికారుల బదిలీల కోసం ఎంపీ సిఫార్సు లేఖలు ఇవ్వగా ఎంపీలకు అధికారుల బదిలీలతో సంబంధమేమిటని ఎమ్మెల్యే గొడవకు దిగారు. ఎంపీ మాట వినవద్దని జిల్లా స్థాయి అధికారులకు అల్టిమేటం ఇచ్చారు. జిల్లా అధికారులతో ఎమ్మెల్యే సమావేశమైన ఫొటోలు బయటకు రాగానే ఎంపీ అధికారులతో రివ్యూలు పెట్టి ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారు.

రోడ్డెక్కిన రియల్ గొడవ

బాపట్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో వర్మకు విబేధాలు పొడచూపాయి. అనధికార లేఅవుట్లంటూ పలు వెంచర్లకు ఎమ్మెల్యే నోటీసులు ఇప్పించారు. దీంతో రియల్టర్లు ఎంపీని ఆశ్రయించారు. ఆయన మంత్రులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో తన నియోజకవర్గంలో పెత్తనమేంటని ఎమ్మెల్యే ఎంపీని నిలదీశారు. దీంతో గొడవ రోడ్డెక్కింది. మద్యం షాపుల టెండర్ల వ్యవహారంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పోటీ పడి అనుచరులతో టెండర్లు వేయించారు. బాపట్ల కూరగాయల మార్కెట్ సెంటర్లో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు పోటాపోటీగా పక్కపక్కనే మద్యం షాపులు ఏర్పాటు చేయడం వారి మధ్య విబేధాలను బయట పెట్టింది. ఇసుక రవాణాలోనూ ఇద్దరూ నువ్వానేనా అన్నట్టు పోటీ పడుతున్నారు.

బీచ్ సందర్శన పన్నుపై వ్యతిరేకత

తాజాగా సూర్యలంక బీచ్ సందర్శనకు తలకు రూ.20 పన్ను విధిస్తున్నట్లు ఎమ్మెల్యే నరేంద్రవర్మ ప్రకటించడం సంచలనం రేపింది. ఎన్నడూ లేని విధంగా బీచ్ సందర్శనకు పన్ను విధించడమేంటని స్వపక్షం నుంచే వ్యతిరేకత వెల్లువెత్తింది. మత్స్యకారులు, ప్రజలు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే చర్యలతో ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను పసిగట్టిన ఎంపీ ముఖ్యమంత్రితోపాటు మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

ఆస్తి కోసం దారుణం

కన్నతండ్రిని చంపిన కుమారుడు



తోక వెంకట్రామయ్య మృతదేహం

ప్రత్తిపాడు: ఆస్తి కోసం కొడుకే కన్నతండ్రిని మంచం కోడుతో కిరాతకంగా కొట్టి హత్య చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడుకు చెందిన తోక వెంకట రామయ్య (60) స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆయన రెండు వివాహాలు చేసుకున్నాడు. మొదటి భార్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండవ భార్యకు సంతానం లేదు. ఈ నేపథ్యంలో మొదటి భార్య కుమారుడు వెంకటకృష్ణ ఆస్తిలో వాటా ఇవ్వాలని తండ్రిని కొంతకాలంగా వేధిస్తున్నాడు. వెంకటకృష్ణకు అతని భార్య కూడా సహకరించేది. ఇద్దరూ కలిసి వెంకటరామయ్యపై ఒత్తిడి తీసుకువచ్చారు. తనకున్న ఎనిమిది సెంట్లలో నాలుగు సెంట్లు కొడుకు, కోడలి పేరుతో ఆయన రాసిచ్చాడు. అయినప్పటికీ సంతృప్తి చెందని కుమారుడు మిగిలిన ఆస్తి కోసం గత కొంతకాలంగా తండ్రితో గొడవ పడుతున్నాడు. కొడుకు, కోడలు కలిసి వెంకటరామయ్యపై కేసులు పెట్టారు. దీంతో వెంకట్రామయ్య సొంత ఇంటిని వదిలేసి వేరే ఇంటికి వెళ్లిపోయాడు. కుమారుడు కూడా భార్య స్వగ్రామానికి వెళ్లిపోవడంతో గొడవలు సర్దుమణిగాయి. వెంకటరామయ్య తిరిగి కోండ్రుపాడులోని సొంత ఇంటికొచ్చి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి అక్కడికి కుమారుడు వచ్చాడు. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లాడు. ఇంతలో వెంకట్రామయ్య రావడంతో ఆస్తి విషయమై వాగ్వాదం చోటుచేసుకుంది. వెంకటకృష్ణ మంచం కోడు తీసుకుని తండ్రి తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ నాగేంద్రలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిల్లలను విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

మంగళగిరి: మంగళగిరి పట్టణంలో పసిపిల్లలను విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు సీఐ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళగిరి పట్టణానికి చెందిన గుమ్మడి త్రినాథ్, ఉమాదేవిలను అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

విజయవర్ధన్‌రావు, చలపతిలను విడుదల చేయాలి



నెహ్రూనగర్: మూడు దశాబ్దాలుగా జీవిత ఖైదీ, కఠిన కారాగార శిక్ష అనుభవిస్తున్న చిలకలూరిపేట బస్సు దహనం కేసులో నిందితులు సాతులూరి చలపతిరావు, విజయవర్ధన్ రావులను మానవతా దృక్పథంతో విడుదల చేయాలని జీవిత ఖైదీల విడుదల సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర హోంమంత్రి అనితను కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సాతులూరి చలపతిరావు భార్య రమణమ్మ, సీనియర్ జర్నలిస్ట్ సాధన సమితి కన్వీనర్ రంగావఝుల భరద్వాజ, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎంజే విద్యాసాగర్, ఎస్ఎన్ భగత్ సింగ్, సీనియర్ జర్నలిస్ట్ నాగార్జున రెడ్డి, అడ్వకేట్ వి.పవన్ కుమార్, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం ఉన్నారు.

ప్రాచీన క్రీడలను కాపాడుకోవాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): సిలంబం (కర్రసాము) లాంటి ప్రాచీన క్రీడలను కాపాడుకోవాలని శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన ఈ నెల 27న సిలంబం స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లోని విజేతలను అభినందించారు.

చిన్న జాగ్రత్తలతో ప్రమాదాలకు చెక్

వ్యాపారులకు అప్రమత్తత అవసరం

దీపావళి పండగపై డీఎఫ్‌ఓ శ్రీధర్

నరసరావుపేట టౌన్: జాగ్రత్తలు పాటించి సంతోషమైన దీపావళి జరుపుకోవాలని పల్నాడు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్. శ్రీధర్ అన్నారు. దీపావళి పండగను పురస్కరించుకొని బుధవారం తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో దీపావళి స్టాల్స్ ఏర్పాటు చేసే వ్యాపారులు, పండగను నిర్వహించుకొనే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను మంగళవారం ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...





డీఎఫ్‌ఓ శ్రీధర్

వ్యాపారులకు లైసెన్స్‌లు...

వ్యాపారి స్టాల్ ఏ ప్రదేశంలో పెడుతున్నారు? అక్కడ నివాసాలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయా? వంటి విషయాలను సంపూర్ణంగా పరిశీలించిన తర్వాత నిరభ్యంతర సర్టిఫికెట్ ఇస్తాం. ఆ తర్వాత ఆర్డీవో లైసెన్స్ మంజూరు చేస్తారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సారి దుకాణాల ఏర్పాటు కోసం లైసెన్స్‌లు పొందిన వారు తక్కువ. పల్నాడు జిల్లాలో నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి పట్టణాలు ఉన్నాయి. ఏటా జిల్లా వ్యాప్తంగా సుమారు 130 మంది దరఖాస్తు చేసుకునేవారు. ప్రస్తుతం 100 మంది వరకు లైసెన్సు పొందారు. నరసరావుపేట పట్టణంలో గత ఏడాది 40 మంది తీసుకుంటే ఈ సారి 27 మంది మాత్రమే తీసుకున్నారు. లైసెన్స్ పొందిన వారు ఈ నెల 29, 30, 31 తేదీల్లో మాత్రమే బాణసంచా విక్రయించాలి.

జాగ్రత్తలు అవసరం

స్టాల్స్ ఏర్పాటు చేసేటప్పుడు మండే స్వభావం లేని మెటీరియల్‌తో దుకాణాలు నిర్మించుకోవాలి. బహిరంగ ప్రదేశాలో షాపు ఉండేలా చూసుకోవాలి. రెండు దుకాణాల మధ్య 3 మీటర్ల దూరం ఉండాలి. పెట్రోల్ బంకుకు 15 మీటర్ల దూరంలో స్టాల్స్ పెట్టుకోవాలి. స్టాల్స్ ఉన్న ప్రదేశంలో పొగతాగటం నిషేధం. ప్రతి షాపు వద్ద రెండు బక్కెట్ల చొప్పున నీళ్లు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలి. ఇక ప్రజలు కూడా టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ కిచెన్‌లో, మూసివున్న గదుల్లో టపాసులు పెట్టకూడదు. పిల్లలు కాల్చేటప్పుడు తప్పనిసరిగా పెద్దవాళ్లు పక్కనే ఉండాలి. గ్రామాల్లో పూరి గుడిసెలు, గడ్డివాముల దగ్గర కాల్చకూడదు. దీపావళి పండగ ప్రతి ఇంటిలోనూ కొత్త వెలుగులు నింపాలంటే కొద్ది పాటి జాగ్రత్తలు పాటించాలి. మన అజాగ్రత్త మరొకరికి శాపంగా మారకూడదు. చిన్న నిర్లక్ష్యం పెను ప్రమాదానికి దారితీస్తుంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వెలుగుల పండగను సంతోషంగా జరుపుకోవాలి.

ప్లాస్టిక్ సంచుల్లో పత్తి తేవొద్దు

- రైతులకు సీసీఐ అధికారుల సూచన
- ఐదు రోజుల్లో రైతు ఖాతాలకు నగదు

నాదెండ్ల: సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్ముకోదలచిన రైతులు ప్లాస్టిక్ సంచులకు బదులుగా గన్నీ బ్యాగ్స్ లేదా లూజుగా పత్తిని తరలించాలని సీసీఐ జనరల్ మేనేజర్ అమర్‌నాథరెడ్డి చెప్పారు. చిలకలూరిపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న ఏపీఎంసీలో రైతులు, మార్కెట్‌యార్డు సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీపావళి తర్వాత చిలకలూరిపేట ప్రాంతంలోని గణపవరంలో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా గణపవరంలోని వెంకటకృష్ణ కాటన్‌మిల్లులో కేంద్రం ప్రారంభిస్తామన్నారు. రైతులు పత్తిని ఆరబెట్టుకుని 8- 12 శాతం మధ్య తేమ ఉన్న పత్తి మాత్రమే కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. సీసీఐ మద్దతు ధర క్వింటాకు రూ.7,521గా నిర్ణయించారని తెలిపారు. 8 శాతం తేమ ఉన్న పత్తికి పూర్తిస్థాయిలో మద్దతు ధర లభిస్తుందని, 8కి మించి పెరిగిన తేమ శాతం ఒకటికి రూ.75 చొప్పున తగ్గించనున్నట్లు వివరించారు. కొనుగోలు చేసిన ఐదు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయనున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు చేయటం ద్వారా పత్తి నాణ్యత తగ్గి జాతీయస్థాయిలో ఏపీ బేళ్లకు నాణ్యత తగ్గుతుందన్నారు. జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి సూర్యప్రకాశరెడ్డి మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న నేపథ్యంలో రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీఐ విజిలెన్స్ అధికారి సంతోష్‌కుమార్, ఏజీఎం రాంప్రసాద్, బయ్యర్ రమేష్‌బాబు, కార్యదర్శి యు యోగేశ్వరరావు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో మాట్లాడుతున్న సీసీఐ జీఎం అమర్‌నాథరెడ్డి

అంతర పంటలతో మెరుగైన ఆదాయం

రాష్ట్ర వ్యవసాయ సలహాదారు టి.విజయ్‌కుమార్

రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో గుర్రాల మల్లికార్జునరావు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కంది పంటను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు టి.విజయ్‌కుమార్, అమెరికా, స్పెయిన్ విదేశీ బృందం సభ్యులు క్రేగ్‌కాట్, కిట్ అగోడా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సలహాదారుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కంది పంటలో అంతర పంటలుగా గోడుచిక్కుడు, చెట్టు చిక్కుడు, పెసర, మినుము, అలసంద, దోస, అనుములు వేయడం ద్వారా రైతులకు ప్రతి నెల ఆదాయం లభిస్తుందని తెలిపారు. కంది పంటకు అయ్యే ఖర్చు అంతా అంతర పంటల ద్వారా రైతులకు లభిస్తుందని వివరించారు. భూమిలో అన్ని రకాల పంటలు వేయడం ద్వారా భూమిలో జీవవైవిధ్యం పెరిగి భూమి సారవంతమవుతుందని చెప్పారు. అంతర పంటల అనంతరం మళ్లీ టమాటా, వంగ, నువ్వులు, ఆముదం వంటి పంటలు వేయడం ద్వారా భూమి 365 రోజులు కప్పి ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. భూమి భూతాపానికి గురికాకుండా ఉంటుందని పర్యావరణం పరిరక్షించవచ్చని వివరించారు. విదేశీ బృందం సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రం ప్రకృతి వ్యవసాయం చాలా ఉధృతంగా జరుగుతుందని, దీనివలన భూమి పర్యావరణ రక్షణతో పాటు విషరహిత ఆహారం లభిస్తుందని, ప్రకృతి వ్యవసాయం చేసే ప్రతిరైతు దైవసమానులని వర్ణించారు. పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ ఏటీఎం మోడల్(నిరంతర ఆదాయం)చేయడం ద్వారా కుటుంబానికి విష రహిత ఆహారంతోపాటు ఆకుటుంబానికి నిరంతర ఆదాయం లభిస్తుందని తెలిపారు.



బ్రాహ్మణపల్లిలో పంటలను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు

వనితా ఓటర్లే అధికం

సంక్షిప్త ఓటర్ల జాబితా విడుదల

నరసరావుపేట: జిల్లాలో సంక్షిప్త ఓటరు నమోదు జాబితా ప్రతులను ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులు విడుదల చేశారు. ఈ జాబితా మేరకు జిల్లాలో మొత్తం 17,35,365 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గం గురజాల కాగా, అత్యల్ప ఓటర్లు ఉన్న నియోజకవర్గం చిలకలూరిపేట కావడం విశేషం. ఇదిలా ఉంటే జిల్లావ్యాప్తంగా పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 41,592 మంది అధికంగా ఉండటం, ప్రతి నియోజకవర్గంలోనూ మహిళా ఓటర్లదే పైచేయి కావడం గమనార్హం.

తాజా జాబితా ప్రకారం.. జిల్లాలో ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
పెదకూరపాడు	266	1,13,202	1,18,878	15	2,32,095
చిలకలూరిపేట	242	1,08,395	1,18,180	47	2,26,622
నరసరావుపేట	248	1,13,139	1,19,607	30	2,32,776
సత్తెనపల్లి	274	1,18,445	1,23,661	12	2,42,118
వినుకొండ	299	1,31,353	1,33,504	20	2,64,877
గురజాల	304	1,33,488	1,40,716	42	2,74,246
మాచర్ల	299	1,28,771	1,33,839	21	2,62,631
మొత్తం	1,932	8,46,793	8,88,385	187	17,35,365

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా నారాయణ

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నారాయణరావు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గుంటూరు జీజీహెచ్‌లో సంఘం కేంద్ర కమిటీ నేతలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో డాక్టర్ నారాయణరావును ఎన్నుకున్నట్లుగా తీర్మానం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు పదోన్నతి లభించి కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు. ప్రస్తుతం డాక్టర్ నారాయణరావు ఇప్పటివరకు ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా సంఘంలో కొనసాగుతున్నారు. ఇప్పుడు ఎగ్జిక్యూటీవ్ సభ్యుడిగా డాక్టర్ గంగన్నను ఎన్నుకున్నారు. అనంతరం యూనియన్ నేతలు డాక్టర్ నారాయణరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నేతలైన వైద్యులు ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్, మారుతిదేవి, భానుకుమార్, స్వరూప్ కాంత్, వి.వి.కిరణ్, ఇందిరప్రియదర్శిని, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కామెల్ సఫారీకి ఎన్‌ఈసీ క్యాడెట్స్ ఎంపిక

నరసరావుపేట రూరల్: రాజస్థాన్‌లో నవంబర్ 14 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ కామెల్ సఫారి శిక్షణ శిబిరానికి నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. కళాశాలకు చెందిన క్యాడెట్స్ ఎం.హేమంత్, ఎస్.సాహిత్యరెడ్డి భారతదేశం తరఫున పాల్గొంటారని వివరించారు. ఒంటెల మీద సఫారీ చేస్తూ స్థానిక సంస్కృతిని, ప్రకృతి అందాలను వీక్షించే అరుదైన అవకాశం క్యాడెట్స్‌కు దక్కిందని తెలిపారు. అరుదైన అవకాశం పొందిన క్యాడెట్స్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, 23వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ సునీల్‌గౌతమ్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్, 23వ ఆంధ్ర బెటాలియన్ ట్రైనింగ్ జేసీవో రేఖారాం సింగ్, బీహెచ్ఎమ్ రమేష్ అభినందించారు.



కామెల్ సఫారీకి ఎంపికైన క్యాడెట్స్‌ను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు

ముగిసిన బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలికల జట్టుతో ఉపాధ్యాయులు

శావల్యాపురం: క్రీడాలు మానసిక వికాసంతో పాటు శారీరక ధృడత్వానికి దోహదపడతాయని శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్ -14 విభాగంలో 13 మంది, అండర్-17 విభాగంలో 13 మంది బాలికలు రాష్ట్ర స్థాయి బాలికల జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ పాఠశాల సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు ఎంపికైనా బాలికలకు షీల్డ్‌లను వితరణ చేశారు. పాఠశాల పీడీ పల్నాడు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ రాగుల రాధాకృష్ణమూర్తి సారథ్యంలో క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి.

బైపాస్ బాధితులకు బహుమతులు అందజేత

రూ.7 కోట్ల విలువ చేసే పరికరాలు పంపిణీ



బైపాస్ బాధితులకు బహుమతులు అందజేస్తున్న నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే ఉన్నతాధికారులు

పిడుగురాళ్ల: అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధిత రైతులకు, చేతివృత్తి వారికి నామ్స్ క్యాబ్ హైవేస్ రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైవే క్లబ్ చైర్మన్ డాక్టర్ హరికృష్ణారెడ్డి హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా బాధితులకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ బాధితులకు ట్రాక్టర్లు, కార్లు, ప్రింటర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆటోలు, కుట్టు యంత్రాలు, ప్రయోగశాల పరికరాలు, రిఫ్రిజిరేటర్లు, సబ్‌మెర్సిబుల్ మోటార్లు, పంపు సెట్లు వంటి పది రకాల అవసరమైన వస్తువులు పంపిణీ చేసినట్లు చెప్పారు. మొత్తం 1200 మందికి సుమారు రూ.7 కోట్లు విలువ చేసే వస్తువులు అందజేసినట్లు తెలిపారు. పిడుగురాళ్ల పరిధిలో 300 మంది బాధితులకు 1000 పైగా వస్తువులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఓఓ డాక్టర్ భగవాన్‌రాజ్, సీఈఎస్ డాక్టర్ అశోక్‌శర్మ, రీజనల్ మెడ్ కృష్ణారావు, నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే సిబ్బంది పాల్గొన్నారు.

అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్



నరసరావుపేట: అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లకు నిర్వహించిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాలో నిరక్షరాస్యులు 10,707 మంది ఉన్నారని, శ్రద్ధతో వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. అడల్ట్ ఎడ్యుకేషన్ నోడల్ అధికారి కృష్ణ మాట్లాడారు. ఏపీవో మల్లికార్జున, పర్యవేక్షకులు రవిగోవర్ధన్, రఘునాథబాబు. నాగేశ్వరరావు రిసోర్స్ పర్సన్‌లు ప్రియదర్శిని, కృష్ణప్రియ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా స్పెషల్ డ్రైవ్

పిడుగురాళ్ల: మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు పిడుగురాళ్ల ఆర్‌టీఎఫ్ సీఐ కె.ఏడుకొండలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుంటూరు నుంచి పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్తున్న సికింద్రాబాద్, ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో గుంటూరు, పిడుగురాళ్ల మధ్యలో ఆరుగురు బాలురను హౌరా నుంచి నల్గొండ, సికింద్రాబాద్‌కు ప్రయాణిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వారు కూలి పనులకు వెళ్తున్నట్లు అనుమానిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక బృందం వారిని రక్షించి పిడుగురాళ్ల రైల్వే పోలీసులకు తీసుకొని రావటం జరిగిందన్నారు. ఈ ఆరుగురు చిన్నారులను గుంటూరు జిల్లా చైల్డ్ వెల్ఫేర్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులను తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

ఖోఖో పోటీలకు గురుకులం విద్యార్థి ఎంపిక



కారెంపూడి: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ఎం.రాజశేఖర్‌నాయక్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. సోమవారం నకరికల్లులో నిర్వహించిన అండర్- 17 జిల్లా ఖోఖో జట్టు ఎంపిక పోటీల్లో రాజశేఖర్ నాయక్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పీఈటీ జేఎల్‌హెచ్ ఫ్రాంక్లిన్, వార్డెన్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా రోప్ స్కిప్పింగ్ జట్లు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరుజిల్లా రోప్ స్కిప్పింగ్ బాల బాలికల జిల్లా జట్లు ఎంపిక పోటీలను మంగళవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా జట్టుకు ఎంపికైన అండర్-14, అండర్-17 బాల బాలికల వివరాలను స్కూల్ గేమ్స్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ప్రకటించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.రవికాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు డి.మూర్తిరాజు, వి.పద్మావతి, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అండర్-17 బాలుర విభాగంలో..

ఎం.ప్రణీత్‌రాజు, ఎం.మణికంఠ, యు.మహేష్(జెడ్పీ హైస్కూల్, కండ్లగుంట), జి.ఆకాష్(జెడ్పీ హైస్కూల్, ముప్పాళ్ల), జి.విజయ్, ఎస్.వెంకటేష్, కె.చినవెంకటకోటేశ్వరరావు, కె.ప్రవీణ్‌కుమార్(జెడ్పీ హైస్కూల్, కండ్లగుంట).

అండర్-14 బాలుర విభాగంలో..

ఎం.భానుసాయి, ఎం.జాషువా, పి.మణికంఠ, వై.డేవిడ్, కె.మనోజ్, జి.చరణ్(జెడ్పీ హైస్కూల్, కండ్లగుంట), కె.సాయిప్రసన్న(జెడ్పీ హైస్కూల్, మందడం), వి.సాయి(జెడ్పీ హైస్కూల్, ముప్పాళ్ల).



రోప్ స్కిప్పింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్

అండర్-17 బాలికల విభాగంలో..

డి.ఆయేషా, ఎల్.భావన(జెడ్పీ హైస్కూల్, కండ్లగుంట), ఎం.ఆనందకుమారి, జి.అంజలి, ఎస్.సుమతి(గురుకుల పాఠశాల, ఉప్పలపాడు, వినుకొండ), ఎం.దివ్య, ఎం.రమ్యశ్రీ(జెడ్పీ హైస్కూల్, ముప్పాళ్ల), సిహెచ్.శివపార్వతి(జెడ్పీ హైస్కూల్, కండ్లగుంట).

అండర్-14 బాలికల విభాగంలో..

జి.శృతి, ఎం.లక్ష్మీజాహ్నవి(జెడ్పీ హైస్కూల్, కండ్లగుంట), కె.ప్రేమలత(గురుకుల పాఠశాల, ఉప్పలపాడు, వినుకొండ), డి.విష్ణుప్రియ, బి.తనూజ, బి.రమ్య(జెడ్పీ హైస్కూల్, ముప్పాళ్ల), ఎస్.మౌనిక(జెడ్పీ హైస్కూల్, అచ్చంపేట).

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని జూనియర్ కాలేజీ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మోహన్ తెలిపిన వివరాలు... రసూల్ పేటకు చెందిన బత్తుల నాగరాజు రోడ్డు వెంబడిగా వెళ్తుండగా గుంటూరు నుంచి మాచర్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనటంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో నాగరాజు(55) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బతుకు తెరువు కోసం వచ్చి...

మృత్యుఒడికి చేరిన వ్యక్తి

పుత్తూరు: కుటుంబ పోషణ కోసం నవారా పట్టీలు అమ్ముకొంటూ జీవనం సాగించే ఓ వ్యక్తి లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఘటన మంగళవారం ఉదయం తిరుపతి జిల్లా పుత్తూరు మండలం తడుకు గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ ఓబులేసు కథనం.. పల్నాడు జిల్లా, పెదకూరపాడు మండలం, పాదపాడు గ్రామానికి చెందిన షేక్‌ఆసీన్(62) మంచాలకు నవారా పట్టీల వ్యాపారం చేసుకొంటూ జీవిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంత కాలంగా రేణిగుంట వద్ద ఓ గది అద్దెకు తీసుకొని చుట్టు పక్కల ఊర్లకు వెళ్లి వ్యాపారం చేసుకొని రాత్రికి ఇక్కడి చేరుకొనేవాడు. మంగళవారం ఉదయం రూమ్ నుంచి నవారా పట్టీలను టీవీఎస్-50 మోటర్ సైకిల్‌పై పెట్టుకొని పుత్తూరుకు బయలుదేరాడు. ఉదయం 6 గంటల ప్రాంతంలో పుత్తూరుకు సమీప తడుకు గ్రామం వద్ద వస్తుండగా తిరుపతి నుంచి పుత్తూరు వైపు వస్తున్న లారీ వెనక నుంచి ఢీకొనడంతో షేక్ ఆసీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ నిద్ర మత్తులో నేరుగా ఢీకొట్టి సుమారు 50 అడుగుల దూరం వరకు లాక్కెళ్లి ఆపాడు. దీంతో మృతుడి శరీరం చిందరవందర అయ్యింది. పోలీసులు మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, బంధువులకు సమాచారం అందించారు.



మృతుడు షేక్ ఆసీన్ (ఫైల్)

భార్యపై కత్తితో దాడి

దాచేపల్లి: భార్యపై భర్త దాడి చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సౌందర్యరాజన్ తెలిపిన వివరాలు.. నగర పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన చిలక బాబు, భార్య జ్ఞానమ్మ మధ్య విభేదాలు రావటంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. కుటుంబ సభ్యులు మాట్లాడి భార్యాభర్తలకు సర్ది చెప్పటంతో తిరిగి ఇంటికి వచ్చింది. జ్ఞానమ్మపై అనుమానంతో పలుమార్లు బాబు గొడవలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య వాగ్వావాదం జరగటంతో ఇంట్లో ఉన్న కత్తితో భార్యపై దాడి చేశాడు. తల, చేతి వద్ద బలమైన గాయాలు అయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి ఆస్పత్రికి తరలించారు. గురజాల ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రాథమిక చికిత్స చేసిన తరువాత మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాబుని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.



బాధితురాలు జ్ఞానమ్మ